ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
1★★
శుక్రవారం 6 సెప్టెంబరు 2024



జోరుగా రేషన్ బియ్యం దందా 2లో..

నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి 6లో..

పత్తాలేని ఫసల్ బీమా



- ఆరేళ్లుగా నిలిచిన కేంద్ర పథకం
- లోపాలున్నాయని పక్కన పెట్టిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- ప్రకృతి విపత్తులతో నష్టపోతున్న అన్నదాతలు

జగిత్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల పరిస్థితుల్లో పంటలు దెబ్బతింటే అన్నదాతలకు అండగా ఉండేందుకు ఫసల్ బీమా యోజన అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖరీఫ్ సాగు ప్రారంభమై రోజులు గడుస్తున్న నేటికి మార్గదర్శకాలు విడుదల కాలేదు. దీంతో పంటలకు బీమా ఉందా.. లేదా అనే సందిగ్ధం నెలకొంది. రైతులపై ఆర్థికభారం తగ్గించేందుకు ప్రభుత్వమే వందశాతం ప్రీమియం చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. కానీ పత్తి, పెసర, మినుము వంటి పంటలకు సంబంధించి గడువు జూలైతో ముగిసింది. వరి పంటలకు సంబంధించి గడువు కూడా దాటి పోయింది. ఈ సమయంలో పథకం గడువు పొడిగిస్తారా... రాబోయే సీజన్‌లో అమలు చేస్తారా.. అనే విషయంపై స్పష్టత కొరవడింది.

జిల్లాలో 4.24 లక్షల ఎకరాల్లో సాగు...

జిల్లా వ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం కంటే అధికంగా వానాకా లంలో పంటల సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 1.60 లక్షల మంది రైతులున్నారు. జిల్లా వ్యాప్తంగా పంటలు సాధారణ సాగు విస్తీర్ణం 3,35, 978 ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 4,24,425 ఎకరాలు సాగు చేస్తున్నారు. మండలాల్లోని క్లస్టర్ల వారీగా సాగు విస్తీర్ణం అంచనాలను వ్యవసాయ అధికారులు రూపొందించారు. ఇందులో ప్రధానంగా వరి 3,05,000 ఎకరాలు, మొక్కజొన్న 41,000 ఎకరాలు, కందులు 2,500, పెసర్లు 150, ఇతర పప్పులు 675, సోయా చిక్కుడు 600, పత్తి 20,200, చెరుకు 1,200 ఎకరాలు, పసుపు 11,000, ఇతర పంటలు 42,100 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

మూడేళ్లుగా నిరాశే...

రాష్ట్రంలో గత ఆరేళ్లలో ఫసల్ బీమా పథకం సరిగా అమలుకు నోచుకో కపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మూడేళ్లుగా భారీ వర్షాలు, వరద కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందని ద్రాక్షగానే మిగిలింది. కేంద్ర ప్రభుత్వం సహకారంతో అమలవుతున్న ఈ పథకానికి గత ప్రభుత్వం వివిధ కారణాలతో దూరమవడమే ఇందుకు కారణంగా నిలుస్తోంది. గతంలో కేంద్రం 40 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, రైతులు 20 శాతం ప్రీమియం చెల్లించేవారు.

పంట క్షేత్రాన్ని యూనిట్‌గా...

గతంలో ప్రభుత్వం అమలు చేసిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద మండలాన్ని యూనిట్‌గా తీసుకుని నష్టాన్ని అంచనా వేసేవారు. అయితే వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల కారణంగా యూనిట్‌ను అంచనా వేయలేకపోతున్నారు. దీనితో గ్రామాలను యూనిట్‌గా తీసుకుని పంటల నష్టాన్ని అంచనా వేసినా రైతులకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడంలేదు. దీంతో సాగు చేసిన పంటలకు నేరుగా బీమా సంస్థలు ఇన్సూరెన్స్ అవకాశం కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఆశలు చిగురించేనా...

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీమా ఆవశ్యకతను గుర్తించి పథకాన్ని పునరుద్ధరించేందుకు నిర్ణయించింది. ప్రస్తుత వానాకాలం అన్ని పంటల సాగు జోరుగా జరుగుతున్నాయి. ఈ సమయంలో బీమా ఎలా వర్తింపజేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే యాసంగిలో అమలు కు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. వర్షాకాలం మరో నెల రోజులు ఉంటుంది. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పంట చేతికందే సమయంలో నష్టపోవాల్సి రావచ్చన్న ఆందోళన రైతుల్లో నెల కొంది. గడువు పెంచి అయినా సరే పథకం అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రతీ యేటా తప్పని పంట నష్టం...

జిల్లాలో వరి ప్రధాన పంటగా, తరువాత ఎక్కువగా మొక్కజొన్న, పత్తి సోయా, కందులు, పెసర్లు, చెరుకు పంటలను సాగు చేస్తారు. ఇతర పంటలు తక్కువ విస్తీర్ణంలో సాగవుతాయి. యేటా ఏదో రకంగా రైతులు పంటలను నష్టపోతున్నారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకునేందుకు వీలుగా ప్రభుత్వం పంట బీమా పథకం అమలు చేస్తోంది. గతంలో బ్యాంకు నుంచి రుణం పొందే రైతులకు పంట బీమా తప్పని సరి చేశారు. రుణంతో సంబంధం లేకుండా పంటలను సాగు చేసే రైతులు మాత్రం బీమా చేయడమనేది వారి ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. తర్వాత ప్రీమియం చెల్లింపు అనేది రైతుల ఇష్టానికి వదిలేశారు. పత్తికి వాతా వరణ ఆధారిత, సోయాకు గ్రామం యూనిట్, ఇతర పంటలకు మండల యూనిట్‌గా బీమా పథకాన్ని అమలు చేశారు. తాజాగా ఏయే పం టలకు బీమా వర్తింపజేస్తారు, ప్రీమియం, పరి హారం, బీమా ఎలా అమలు అనేది తేల్చాల్సి ఉంది. వీటికి సంబంధించి వ్యవ సాయశాఖకు ఇంకా స్పష్టమైన ఆదేశాలు రాలేదు.

బీమా సౌకర్యం కల్పించాలి



కూసరి మల్లారెడ్డి, రైతు, వెల్దుర్తి, జగిత్యాల రూరల్ మండలం

ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటలకు ప్రకృతి వైపరీత్యాలతో నష్టం వాటిల్లడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలకు ప్రభుత్వం బీమా చెల్లించి ఆదుకోవాలి.

ప్రభుత్వ నిర్ణయం మేరకే...



వాణి, జిల్లా వ్యవసాయ అధికారిణి

పంటల బీమా అమలు విషయంలో వ్యవసాయ శాఖకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకం గతంలో నిర్ణయించింది. గత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయ లేదు. ప్రభుత్వం ఫసల్ బీమా పథకంపై ఎలాంటి ఆదేశాలు రాలేదు.



విద్య, వైద్యానికి ప్రాధాన్యం

జిల్లా మాతా శిశు ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీచేసిన ఎమ్మెల్యే



ఆస్పత్రిలో పరికరాలను తనిఖీచేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 5 : రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల మాతాశిశు ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం ఎమ్మెల్యే సందర్శించారు. జగిత్యాల మండలానికి చెందిన గర్భిణి అనారోగ్యంతో క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా ప్రసూతి చేసి తల్లీబిడ్డను వైద్యులు సురక్షితంగా రక్షించారు. తల్లీబిడ్డలను కాపాడిన వైద్యులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవల కారణంగా బెడ్లు సరిపోని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులపై డీఎంఈతో ఫోన్‌లో ఎమ్మెల్యే మాట్లాడగా పోస్టుల భర్తీకి డీఎంఈ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. రూ. 10 కోట్లతో క్రిటికల్‌కేర్ యూనిట్‌సైతం ఏర్పాటు చేస్తామని, త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. జగిత్యాల ప్రజలకు నాణ్యమైన చికిత్స అందించడమే ప్రధాన ధ్యేయమన్నారు. ఈకార్యక్రమంలో సూపరిండెండ్ రాములు, హెచ్‌వోడీ అరుణ, ఆర్ఎంవో యాకూబ్‌పాషా డాక్టర్ గీతిక, నాయకులు నారాయణ, శ్రీనివాస్, శేఖర్, వైద్యులు పారామెడికల్‌స్టాఫ్ పాల్గొన్నారు.

ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటు



చిలుముల లావణ్య

ధర్మపురి, సెప్టెంబరు 5: ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా చిలుముల లావణ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో జారీ చేస్తూ చైర్‌పర్సన్ సహా 18 మందితో కూడిన సభ్యులను నియమించింది. చైర్‌పర్సన్‌గా చిలుముల లావణ్య, వైస్‌చైర్మన్‌గా సంగ నర్సింహులు, సభ్యులుగా గందం రాజయ్య, ఎండీ రఫి యొద్దీన్, వాంకుడోతు గీతాంజలి, మెరుగు పురుషోత్తం, తొట్ల రాజయ్య, ఎన్నం మదుకర్‌రెడ్డి, తాండ్ర అశోక్ రావు, ఏనుగు జోగిరెడ్డి, రామడుగు రవి, కాశెట్టి రాజేష్‌ను నియమిస్తూ ఉత్త ర్వులు జారీ అయ్యాయి.

అలాగే గునిశెట్టి అంజయ్య, దైత శ్రీనివాస్, తిమ్మాపూర్ పీఏసీఎస్ చైర్మన్, జగిత్యాల జిల్లా మార్కెటింగ్ అధికారి, ధర్మపురి ఏడీఏ, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్‌ను సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

నాణ్యతతో కూడిన విద్యను అందించాలి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జగిత్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నాణ్యతతో కూడిన విద్యను అందించాలని, విధి నిర్వహణ పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం ఉపాధ్యాయుల ది నోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో పాటు బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాల్సింది ఉపాధ్యాయులే అన్నారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురు ఉపాధ్యాయులకు మెమెంటో, సర్టిఫికెట్‌తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ పి. రాంబాబు, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ అలువల జ్యోతి లక్ష్మణ్, డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల వివరాలు ప్రదర్శించాలి

జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 5 : ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగుల వద్ద నుంచి తీసుకుంటున్న ఫీజుల వివరాలను పట్టికలరూపంలో ఆస్పత్రుల్లో ప్రదర్శించాలని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎవరైనా రోగుల నుంచి అధిక ఫీజులు వసూల్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఒకరిపేరుమీద అనుమతులు పొంది మరొకరి పేరు మీద ఆస్పత్రి నడిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యాసంస్థల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 4: జగిత్యాల పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటీ అకాడమీలో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, మౌనికరావు, అజితరావు, రజిత రావు తదితరులున్నారు.

●ఉపాధ్యాయుల ద్వారానే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శివవీధి, కృష్ణానగర్, విద్యానగర్ పాఠశాలల్లో అల్ఫోర్స్ గురుపూజోత్సవ్ పేరుతో నిర్వహించిన ఉపాధ్యాయ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.

●పట్టణంలోని తపోవన్ హై స్కూల్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి, విద్యార్థులకు పాఠాలను బోధించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కరస్పాండెంట్ అనుమల్ల శ్యామ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి అని, ఆయన సేవలు వెలకట్టలేనివన్నారు. విద్యార్థులను ఘనంగా సన్మానించి, బహుమతులు ప్రదానం చేసిన ఆయన విద్యార్థులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ శ్వేత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●ఇటీవలే పదవీవిరమణ పొందిన గురువును ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు దావ వసంత సురేష్ మెమెంటో అందించి, శాలువాతో సత్కరించి, గురువు నందెల్లి మదన్‌మోహన్ రవు ఆశీస్సులు తీసుకున్నారు.

●ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఎంపికైన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్ తత్వాది ప్రమోదకుమార్ హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ప్రిన్సిపాల్ కలువకుంట రామకృష్ణతో పాటు సహచర అధ్యాపకులు, సాహితీవేత్తలు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

●పట్టణంలోని స్థానిక నవ్య బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులు ఉపాధ్యాయులుగా మారి సహచర విద్యార్థినులకు పాఠాలు బోధించారు. ముఖ్య అతిథిగా హాజరైన కరస్పాండెంట్ శ్రీపాద నరేష్ హాజరై విద్యార్థులకు వేడుక గొప్పతనాన్ని వివరించారు. అనంతరం బోధకులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్, విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

●ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఉపరాష్ట్రపతి స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

●పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక శ్రీభక్త మార్కండేయ ఆలయ ఆవరణలో నూతన పద్మశాలి సేవా సంఘ బాధ్యులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని అన్ని గ్రామాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో ఎంఈవో నరేశంతో పాటు ఉపాధ్యాయులను గ్రామ పం చాయతీ మాజీ పాలకవర్గ సభ్యులు సన్మానించారు. అయిలాపూర్ గ్రామంలో లయన్స్ క్లబ్ సభ్యులు దీకొండ రాజనర్సయ్య, అశోక్, బోల్లపల్ల రాజలింగం గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు. గ్రామస్థులు ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.



అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో వేడుకలకు హాజరైన నరేందర్‌రెడ్డి



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న జ్యోతి డైరెక్టర్ హరిచరణ్

దెబ్బతిన్న రహదారులను పరిశీలించిన కలెక్టర్



సంద్రల్లపల్లి బ్రిడ్జ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కొడిమ్యాల, సెప్టెంబరు 5 : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో దెబ్బతిన్న కోనాపూర్ కాజ్‌వేను గురువారం కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించారు. అంతకు ముందు మండలంలోని సంద్ర ల్లపల్లి బ్రిడ్జ్‌ను పరిశీలించారు. అనంతరం కోనాపూర్ మాటుకట్టను పరిశీలించారు. కాజ్‌వేలపై బ్రిడ్జ్‌ల నిర్మాణం చేయాలని మాజీ సర్పంచ్ స్వామి రెడ్డి కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మదుసూధన్, డీపీవో ర ఘువరణ్, పీఆర్ ఈఈ రహమాన్, తహసీల్దార్ రాజమణి, ఎంపీడీవో స్వరూప, డీఈఈ చంద్రశేఖర్, పీఆర్ ఏఈఈ చంద్రశేఖర్, ఇర్రిగేషన్ ఏఈఈ రాజేష్‌ఖన్న, ఎంపీవో వాసవి, ఆర్ఐ కరుణాకర్, వర్క్ ఇన్స్‌పెక్టర్ గంగాధర్ ఉన్నారు.

కొచ్చెరువు మత్తడి పరిశీలించిన కలెక్టర్

కథలాపూర్ : మండలంలోని గంభీర్‌పూర్ కొచ్చెరువు మత్తడి భారీ వరదల కారణంగా ధ్వంసమై నీరు వృథాగా పోతున్న నేపథ్యంలో గురువారం కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. నీరు చెరువులోంచి వృథాగా పోకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ జిల్లా ఇరిగేషన్ అధికారి రమేశ్‌ను ఆదేశించారు. దీంతో మత్తడి వద్ద సంచుల్లో ఇసుక నింపి తాత్కాలికంగా నీరు కిందకు పోకుండా మరమ్మతులు అధికారులు చేపట్టారు. అదేవిధంగా పోతారం నుంచి సమీపంలో ఉన్న గిరిజన తండాకు వెళ్లే కల్వర్టు తెగిపోగా అక్కడ జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. గిరిజనులకు రాకపోకలు జరిగేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ ముంతాజీబోద్దీన్, ఇరిగేషన్ డీఈఈ ప్రశాంత్, ఏఈ శ్రీనివాస్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, రాష్ట్ర ఫిషరీస్ విభా గం కార్యదర్శి కల్లెడ గంగాధర్ ఉన్నారు.



గంభీర్‌పూర్‌లో కొచ్చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్

కోతి దాడిలో ఒకరికి గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 5: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన బొజ్జ కొంరయ్యపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంరయ్య కొన్ని రోజుల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. వైద్యుల సూచనల మేరకు ఫిజియోథెరపీ చేస్తున్నారు. గురువారం ఇంటి బయట వరండా మీద ఫిజియోథెరపీ చేసే క్రమంలో కోతుల గుంపు దాడి చేసింది. గాయపడిన కొంరయ్యను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

హోటళ్లను తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్

● కాలంచెల్లిన తినుబండారాల గుర్తింపు

కొడిమ్యాల, సెప్టెంబరు 5: మండల కేంద్రంలోని ఐదు హోటళ్లను గురు వారం జగిత్యాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.అనూష తనిఖీ చేశారు. కాలంచెల్లిన కూల్ డ్రింక్స్, తిను బండారాలను గుర్తించి వాటిని బయట పడేయించారు. తినుబండారాలను ఎల్లపుడూ శుభ్రంగా ఉంచాలన్నారు. కాలం చెల్లిన వాటిని అమ్మకానికి పెడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో సిబ్బంది ఉన్నారు.



కాలం చెల్లిన కూల్ డ్రింక్ పారపోస్తున్న సిబ్బంది

జోరుగా రేషన్ బియ్యం దందా

● గ్రామాల్లో అక్రమంగా కొనుగోళ్లు

మల్యాల, సెప్టెంబరు 5: పేదల కడుపునింపడానికి ప్రభుత్వాలు అందజేస్తున్న రేషన్‌బియ్యం పక్కదారి పడుతోంది. చౌకధరల దుకాణాల ద్వారా నాలుగేళ్లుగా ఉచితంగా అందిస్తున్న బియ్యం కొందరు అక్రమంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ తతంగం మండలంలో కొన్నేళ్లుగా సాగుతున్నప్పటికీ అధికారులు నిమ్మకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి నెల మొదటి వారంలో రేషన్ దుకాణాలలో ఆహారభద్రత కార్డుల ద్వారా బియ్యం పంపిణీ చేస్తుండగా అదే రోజు నుంచి కొందరు వ్యక్తులు కొనుగోళ్లు చేస్తున్నారు. కొందరు బినామీలు బృందాలను ఏర్పాటు చేసుకొని కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ద్విచక్రవాహనాలపై ఇంటింటా తిరుగుతూ కిలో బియ్యానికి రూ.10నుంచి 15వరకు చెల్లిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం గుట్టుచప్పుడు కాకుండా కొనుగోళ్లు చేసిన వ్యక్తులు ఇప్పుడు నేరుగా బియ్యం కొనడం.. తాము ప్రతి నెలా సంబంధిత అధికారులకు మాముళ్లు చెల్లిస్తున్నట్లు పేర్కొంటున్నారు. అందుకే యథేచ్ఛగా కొనుగోళ్లు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో కొందరిని పోలీసులు పట్టుకొని కేసులు నమోదు చేసినప్పటికీ దందా సాగుతోంది.

● రేషన్‌దుకాణాల వద్దే కొనుగోళ్లు

బియ్యంను రేషన్‌దుకాణాల వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేస్తుండగా అక్రమంగా కొనుగోళ్లు చేసే వ్యక్తులు పంపిణీ రోజుల్లో అక్కడే మకాం వేస్తున్నారు. లబ్ధిదారుల వద్ద క్వింటాళ్ల కొద్ది అక్కడే కొనుగోలు చేసి కొండగట్టు తదితర ప్రాంతాల్లో నిలువ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి వ్యాపారులు కొందరు పెద్ద వ్యాపారులకు రూ.20కి అప్పజెప్పుతుండగా మహారాష్ట్రకు తరలించి కిలోకి రూ.25-30వరకు విక్రయిస్తున్నట్లు గ్రామాల్లో కొనుగోలు చేసే వ్యక్తులు తెలుపుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యంలో సగానికిపైగా అక్రమంగా తరలిస్తున్నారని జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



గ్రామంలో ద్విచక్రవాహనంపై బియ్యం తరలింపు

కోర్టు ఆదేశాలతో షటర్లు, ప్రహరీ కూల్చివేత

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 5: సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌లో అక్రమంగా సెల్లార్లలో షెటర్లు నిర్మించారని కొందరు కోర్టుకు వెల్లగా కోర్టు ఆదేశాల మేరకు గురువారం మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో భవనం సెల్లార్లలో నిర్మించిన షెటర్లు, ప్రహరీని కూల్చి వేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్‌కు సబంధించిన భవనం సెలార్లలో షెటర్లు, భవనం పడమర వైపు బాత్‌రూంలు కట్టడంతో ఓ న్యాయవాది కోర్టుకు వెళ్లారు. బాత్‌రూం షెటర్లు, ప్రహరీని తొలగించాలని కోర్టు ఆదేశించడంతో మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో పాక్షికంగా కూల్చి వేశారు.



సెల్లార్‌లోని షెటర్లను తొలగిస్తున్న జేసీబీ

నామమాత్రంగా కూల్చారు : బీజేపీ

మున్సిపల్ వైస్‌చైర్మన్‌కు సంబంధించిన భవన సెల్లార్‌లోని బాత్‌రూం, షెటర్లు, ప్రహరీని కూల్చాలని కోర్టు ఆర్డర్ ఇచ్చినా మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా కూల్చారని బీజేపీ నాయకులు ఆరోపించారు. భవనం పడమర వైపు ఉన్న సెల్లార్లో నిబంధనలకు విరుద్ధంగా బాత్‌రూంలు నిర్మించారని కోర్టుకు ఓ న్యాయవాది వెళ్లగా వాటిని తొలగించాలని కోర్టు ఆర్డర్ ఇచ్చిన వాటిని మాత్రం మున్సిపల్ అధికారులు కూల్చలేదని ఆరోపించారు. 24 గంటల్లో కోర్టు ఆర్డర్ ప్రకారం మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

ఎదురెదురుగా ఢీకొన్న ద్విచక్రవాహనాలు

● ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ -రగుడు ప్రధాన రహదారిపై గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో జగిత్యాల, తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామాలకు చెందిన తాటి సంతోష్, సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాలకు చెందిన తాటి సంతోష్ తన బైక్‌పై వెంకటాపూర్ నుంచి రగుడు వైపునకు వెళుతున్నాడు. గండిలచ్చపేటకు చెందిన సతీష్ తన ద్విచక్ర వాహనంపై అతని భార్యతో కలిసి రగుడు నుంచి వెంకటాపూర్‌కు వస్తున్నాడు. రెండు బైక్‌లు ఎదురెదురుగా అతి వేగంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో సంతోష్, సతీష్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంతోష్‌కు తీవ్ర గాయాలుకావడంతో పరిస్థితి విషమంగా మారింది.

జ్వరంతో ఒకరి మృతి

రుద్రంగి, సెప్టెంబరు 5: రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నోముల రవి (52) అనే వ్యక్తి జ్వరంతో గురువారం మృతి చెందాడు. నోముల రవి 10 రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం వేములవాడ తీసుకువేళ్లే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

లంచం ఇవ్వనందుకు ఉద్యోగం నుంచి తీసేశారు

● ఎంపీడీవో కార్యాలయం ఎదుట మహిళా అటెండర్ నిరసన

గన్నేరువరం, సెప్టెంబరు 5: ఉద్యోగంలో కొనసాగాలంటే లంచం ఇవ్వాలని అధికారులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ గన్నేరువరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఎడ్ల లక్ష్మి గురువారం పురుగుల మందు డబ్బా పట్టుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాలుగా తాను అటెండర్‌గా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నానని, ఇపుడు జీతం పెరగడంతో ఎంపీడీవో తీగల శంకర్, ఏపీవో స్వాతి రూ. 40 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. లంచం ఇవ్వనందుకు తనను ఉద్యోగం నుంచి తీసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను నిరుపేదనని, డబ్బులు ఇవ్వలేనని వేడుకున్నప్పటికీ ఉద్యోగానికి రావద్దని నెల రోజులుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి లంచం అడిగిన అధికారులపై చర్యలు తీసుకొని తన ఉద్యోగాన్ని ఇప్పించాలని వేడుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని లక్ష్మికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించింది.



పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న ఎడ్ల లక్ష్మి

వరదకాలువలో వృద్ధురాలి మృతదేహం లభ్యం

రామడుగు, సెప్టెంబర్ 5 : మండలంలోని షానగర్‌లోని వరద కాలువలో గురువారం వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం రామన్నపేట గ్రామానికి చెందిన పుల్లెల వెంకటమ్మ(82) ఈ నెల 3న ఇంటి నుంచి బయటికి వెళ్లింది. షానగర్ గ్రామానికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. షానగర్‌లోని వరద కాలువ వద్ద గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం వరద కాలువలో వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వయోభారంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు పుల్లెల శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 5: ద్విచక్రవాహనం, బులెరో వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన వేములవాడ నంది కమాన్ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాలరామన్నపల్లి గ్రామానికి చెందిన కదురు నరేష్ అనే వ్యక్తి తన బంధువు అయిన తంగళపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన హర్షవర్ధన్ అనే బాలుడుతో కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్ల వైపు వెళ్తున్నారు. ఇదే క్రమంలో బులెరో వాహనం, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో నరేష్, హర్షవర్ధన్‌కు తీవ్రగాయాలయ్యాయి. హర్షవర్ధన్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైద్రాబాద్ తరలించినట్లు తెలిపారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	74,837	8,867	80.5	74.837
ఎల్లంపల్లి	1,65,579	1,02,496	20.175	16.463
మిడ్ మానేరు	16,550	6,400	27.54	22.804
ఎల్ఎండీ	7,546	290	24.034	19.76
ఎగువమానేరు	27,500	------	2.00	2.00

శ్రీరాంసాగర్ వరద గేట్లు మూసివేత

● ప్రాజెక్టులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో గురువారం శ్రీరాంసాగర్ వరద గేట్లను అధికారులు మూసివేశారు. నాలుగు, అయిదు రోజులుగా ప్రాజెక్టుకు చెందిన 41 వరద గేట్లను పైకి ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. క్రమక్రమంగా వరద రావడం తగ్గుముఖం పట్టడంతో ఉదయం 8 గంటలకు ప్రాజెక్టుకు చెందిన వరద గేట్లన్నింటినీ మూసివేశారు. వరద కాలువకు సైతం నీటిని వదలడాన్ని క్రమక్రమంగా తగ్గించారు. ఎస్సారెస్పీలోకి 74,837 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 74.837 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 8,867 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.


ఎస్సారెస్పీ ప్రాజెక్టు


ధర్మపురిలో స్నానఘట్టాల వద్ద గోదావరి ప్రవాహం

శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

పెద్దపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద కొనసాగుతున్నది. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 1,65,579 క్యూసెక్కుల వరద నీరు ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్నది. దిగువకు 20 గేట్ల ద్వారా 1,02,496 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.4 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి/ఇల్లంతకుంట: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి 15,000 క్యూసెక్కులు మూల వాగునుంచి, మానేరు వాగు ద్వారా 1,550 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్ఎండీకి నీటి విడుదలను నిలిపివేయగా, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లు గాను ప్రస్తుతం 316.07 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 22.804 టీఎంసీల మేరకు చేరుకొంది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 3.5 టీఎంసీల సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 2.96 టీఎంసీలకు చేరుకుంది. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి ఎగువన ఉన్న సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

20 టీఎంసీలకు చేరువలో ఎల్ఎండీ


ఎల్ఎండీ రిజర్వాయర్‌లో నీరు

తిమ్మాపూర్: నిరంతరంగా కురుస్తున్న వర్షాల కారణంగా కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం 20 టీఎంసీల నీటి మట్టానికి చేరుకుంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసిలకు 19.76టీఎంసిల నీరు ఉంది. వర్షం తగ్గుముఖం పట్టడంతో మోయతుమ్మెద వాగు ఉధృతి తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ఎల్ఎండిలోకి మోయతుమ్మెద వాగు నుంచి 5,715క్యూసెక్కులు, ఎగువ ఎల్ఎండి నుంచి 1831క్యూసెక్కులు మొత్తం 7,546క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా, ఆవుట్ ఫ్లో 290క్యూసెక్కులు ఉంది. ఎంఎంఆర్ నుండి ఎల్ఎండిలోని వస్తున్న ఇన్‌ఫ్లోలను గురువారం నిలిపివేశారు.

ధర్మపురి వద్ద ఉధృతంగా గోదావరి ప్రవాహం

ధర్మపురి : ధర్మపురి వద్ద గోదావరి నది నీటి ప్రవాహం గురువారం సాయంత్రం వేగంగా కొనసాగింది. గోదావరి నీటి మట్టం క్షణ క్షణం పెరిగి వేగంగా ప్రవాహించింది. స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా అధికారులు అప్రమత్తం చేశారు. తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, వరద పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

యువకుడి ఆత్మహత్య


ప్రవీణ్(ఫైల్)

సైదాపూర్, సెప్టెంబరు 5: సైదాపూర్ మండలంలోని బొత్తలపల్లి గ్రామానికి చెందిన మెడవేణి ప్రవీణ్(25) అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రవీణ్ కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చూసే సరికి ప్రవీణ్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

రాజన్న భక్తురాలి ఆకస్మిక మృతి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 5: కుటుంబ సమేతంగా రాజన్న దర్శనానికి వచ్చిన కొత్తకొండ విజయ (52) అనే భక్తురాలు గురువారం మృతి చెందారు. రాజన్న దర్శనానికి వచ్చి దర్శించుకుని గదిలోకి వెళ్లే క్రమంలో ఆలయ పరిసర ప్రాంతంలో ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే బంధువులు వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విజయ రాజన్న దర్శనం కోసం కుటుంబసమేతంగా వచ్చారు. మృతురాలది సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చోటపల్లి గ్రామం అని తెలిపారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల ఫోన్లు ట్యాపింగ్

● హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 5: అధికారులు, ప్రజాప్రతినిధుల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ తనతో పాటు కరీంనగర్ సీపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని ఆరోపించారు. మానకొండూర్ శాసనసభ్యుడు మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంట్లో ఒక ఇంటర్వ్యూ ఇచ్చాడని, అందులో మానకొండూర్ సీఐకి సీపీ టెలీకాన్ఫరెన్స్ రావడం లేదని, సీఐతో సీపీ మాట్లాడటం లేదని చెప్పారన్నారు. టెలీకాన్ఫరెన్స్ అనేది ఒక ఇంటర్నల్ విషయమని, అలాంటి విషయం ఎమ్మెల్యేకు ఎలా తెలిసిందో సమాధానం చెప్పాలన్నారు. జిల్లాలోని అందరి అధికారుల ఫోన్లు ట్యాప్ అవుతున్నాయన్నారు. ఒక ఐపీఎస్ ఫోన్ ట్యాప్ చేసినపుడు ఎమ్మెల్యేల ఫోన్ ట్యాపింగ్ చేయడం లేదని గ్యారంటీ ఏమిటని ప్రశ్నించారు. తాము పోస్టింగ్‌లు ఇప్పిస్తే సీపీ తీసుకోవడం లేదని ఎమ్మెల్యే చెబుతున్నారన్నారు. ముఖ్యమంత్రి పైరవీలకు తావు లేదని చెప్పాడని, అలాంటపుడు పోస్టింగ్‌లు ఎలా ఇప్పిస్తున్నారో చెప్పాలన్నారు. ఓడిపోయిన వ్యక్తి ఇక్కడ చెక్కులు పంచుతున్నాడన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ఏ చెక్కు అయినా పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యేలకు హక్కు ఉంటుందన్నారు. అవసరమైతే తాను మళ్లీ వెళ్తా అన్నారు. సీపీ ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పందించి సీబీఐ విచారణ చేపట్టాలన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ జరుగలేదని, కేవలం 40శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని గుర్తు చేశారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, మాజీ మున్సిపల్ చైర్మన్ పోడేటి రామస్వామి, టంగుటూరి రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమ బిల్లు ప్రవేశపెట్టాలి

● యాదగిరి శేఖర్ రావు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 5: ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సంక్షేమ బిల్లును వెంటనే పార్లమెంట్, అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులకు 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా, మరో 10 లక్షల రూపాయల జీవిత బీమాను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం 10వ తరగతిలో 10/10 జీపీఏ సాధించే విద్యార్థుల్లో 90శాతం విద్యార్థులు బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల్లో నుంచి వస్తున్నారని అన్నారు. భావి భారత పౌరులను దేశానికి అందిస్తున్నది కూడా బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలేనన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా గౌరవించి సముచిత స్థానం ఇవ్వాలని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శేఖర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారు మైసమ్మ చెరువు సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు గురువారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ 14,970 నగదుతో పాటు పేకాటకు సంబంధించిన సామగ్రిని స్వాధీన పర్చుకున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకుల రిమాండ్

● 150 గ్రాముల గంజాయి స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: మండలంలోని నారాయణపూర్ గ్రామ శివారులో గంజాయి విక్రయించేందుకు వచ్చిన కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రానికి చెందిన యువకులు అఖిల్, ఖాసీంలను పట్టుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ గురువారం తెలిపారు. నారాయణపూర్ గ్రామ శివారులో ఈ నెల 4న ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు వాహన తనిఖీలను చేపట్టారని పేర్కొన్నారు. ఇద్దరు యువకులు బైక్‌పై అనుమానస్పదంగా సంచరిస్తుండగా పట్టుకుని విచారించామని చెప్పారు. వారి వద్ద నుంచి 150 గ్రాముల ఎండు గంజాయితో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. అఖిల్, ఖాసీంలు గంజాయికి అలవాటు పడి గంగాధర మండలం కాశిరెడ్డిపల్లి గ్రామంలోని యువకుడు మధు వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని తమ విచారణలో అంగీకరించారని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా, సేవించినా తమకు సమాచారం అందిస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు మారెల్లి నాగరాజు తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని ఓ ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి తీవ్రంగా మారింది. గ్రామంలోని రైతు మారెల్లి నాగరాజు తనకున్న వ్యవసాయ పొలం వద్ద నుంచి పాడిగేదెలను పశువుల పాక వద్దకు ప్రధాన రహదారి పక్క నుంచి తీసుకెళుతున్నాడు. ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లి వైపుకు వెళ్తున్న ఆటో అతివేగంగా నాగరాజును వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ఆయన ఎగిరి రోడ్డుపై ఉన్న డివైడర్‌పై పడ్డాడు. తలకు బలమైన గాయాలవడం వల్ల పరిస్థితి తీవ్రంగా ఉందని వైద్యులు పేర్కొన్నారని కుటుంబ సభ్యులు, స్థానికులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రాజన్న ఆలయంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

శనివారం కల్యాణం, అభిషేకం పూజల రద్దు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 5: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం నుంచి 15వ తేదీ ఆదివారం వరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వినాయక చవితి సందర్భంగా ఆలయ నాగిరెడ్డి మండపంలో ఉదయం 9.05 గంటలకు పుణ్యాహవాచనము, అఖండ దీపారాదన, సిద్ధి బుద్ధి వినాయక ప్రతిష్ఠ నిర్వహిస్తామన్నారు. వినాయక చవితి రోజున సాయంత్రం 4 గంటలకు శమంతకోపాఖ్యానము చేపట్టనున్నారు. 14వ తేదీన భాద్రపద శుద్ధ ఏకాదశి శనివారం రోజున ఉదయం 9 గంటలకు మహాగణపతి మూలమంత్ర హవనము, సాయంత్రం 7.15 గంటలకు లక్ష్మీగణపతి స్వామి వారికి మహాపూజ, 15వ తేదీన భాద్రపద శుద్ధ ద్వాదశి ఆదివారం రోజున హవనానంతరం ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, రాత్రి 7.15 గంటలకు పెద్దసేవ ఊరేగింపు అనంతరం గణేశ నిమజ్జనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా వినాయక చవితి సందర్భంగా శనివారం రాజన్న ఆలయంలో నిర్వహించే కల్యాణాలు, అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

రేషన్ బియ్యం పట్టివేత

బీర్‌పూర్,సెప్టెంబరు 5: మండలంలోని తుంగూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన కోట సంతోష్ అనే వ్యక్తి ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని కొనుగోలు చేసి తుంగూర్ గ్రామంలో అక్రమంగా నిల్వచేసి తరలించడానికి సిద్ధంగా ఉంచాడు. పోలీసులకు అందిన సమాచారంతో సోదాలు నిర్వహించి 5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి నిందితుడు సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు.

దంపతుల మధ్య మనస్పర్థలు

● అత్తగారింటిలో వివాహిత బైఠాయింపు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: భార్యభర్తల మధ్య మనస్పర్థల వల్ల కొంతకాలంగా విడివిడిగా ఉంటుంటగా, భార్య నుంచి విడాకులు కావాలని భర్త కోర్టును ఆశ్రయించడంతో పుట్టింటి నుంచి చేరుకున్న వివాహిత అత్తగారింటిలో బైఠాయించింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు. గ్రామంలోని ఆంజనేయులుకు బోయినపల్లి మండలం బూరుగుపల్లికి చెందిన కల్యాణితో వివాహమైంది. కొంత కాలం సజావుగా సాగిన వారి కాపురంలో గొడవలు నెలకొన్నాయి. దాంతో కల్యాణి నాలుగేళ్ల కిందట పుట్టింటికి వెళ్లింది. పలుమార్లు పెద్దలు పంచాయితీ నిర్వహించి కలిసి ఉండాలని సూచించినా ఫలితం లేకుండాపోయింది. భార్యాభర్తల మధ్య నెలకొన్న గొడవలతో కోర్టులో కేసు కొనసాగుతోంది. ఈ క్రమంలో భర్త ఆంజనేయులు తన భార్య నుంచి విడాకులు కావాలని నోటీసులు పంపించడంతో కల్యాణి పుట్టింటి నుంచి వెంకటాపూర్‌లోని అత్తగారింటికి చేరుకుంది. తాను ఇక్కడే ఉంటానని భీష్మించుకు కూర్చుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. గొడవలు చోటు చేసుకోకుండా ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

రాష్ట్రంలో హైడ్రా పేరుతో డ్రామా నడుస్తోంది..

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 5 : రాష్ట్రంలో హైడ్రా పేరుతో డ్రామా నడుస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెద్దబొంకూరు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.. 90 ఏళ్ల క్రితం నైజాం పాలనలో సర్వే నంబర్ల వారీగా సమగ్ర సర్వే నిర్వహించారని, అప్పటి నుంచి నేటివరకు ఆ విధంగా సర్వేలు నిర్వహించలేదన్నారు. రెవెన్యూ చట్టంలో మొదటి ఎజెండాగా సర్వే నంబర్ల వారీగా సర్వే నిర్వహించాలని ఉందని, ఈ విషయంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేశామన్నారు. ఆయన పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి కూడా భూ కమిటీని వేశారని, కమిటీ సభ్యులను కలిసి సర్వే విషయమై వినతిపత్రం అందించామన్నారు. రికార్డులు సరిచేస్తామని చెప్పడమే తప్ప చేపట్టడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న హైడ్రాను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలుచేయాలన్నారు. అక్రమ కట్టడాల్లో ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులే ఉన్నారని, వారి నుంచి కొంతమంది ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికయ్యారన్నారు. సర్వే నంబర్ల వారీగా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని, దీంతో అక్కడ నిర్మించిన కట్టడం అక్రమమని తేలితే ఆధారాలతో కూల్చేస్తే బాగుంటుందన్నారు. ప్రభుత్వ భూములు, చెరువుశిఖం, నాలా వంటి భూములను ఆక్రమిస్తున్నారని, వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని, అందులో కూడా పేద కుటుంబాలు ఉంటాయని వారికి ప్రత్యామ్నాయంగా ఇళ్లు కట్టించాలన్నారు. 2లక్షల రుణమాఫీ విషయంలో ప్రతి రైతుకు వర్తింపజేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సహాయ కార్యదర్శి గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, మడికొండ ఒడెమ్మ, పోడం స్వామి, సూర్య పాల్గొన్నారు.


పెద్దబొంకూరులో విలేకరులతో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సైబర్‌క్రైం కేసు నమోదు

బోయినపల్లి, సెప్టెంబర్ 5: ఓ వ్యక్తికి చెందిన కరెంట్ ఆకౌంట్ సిమ్ కార్డు తీసుకొని ఎక్కువ మొత్తంలో బ్యాంక్ ద్వారా లావాదేవీలు జరిపిన సంఘటనపై ఖాతాదారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గురువారం బోయినపల్లి ఎస్ఐ పృథ్వీదర్ గౌడ్ తెలిపారు. వివరాల ప్రకారం నీలోజిపల్లి గ్రామానికి చెందిన ఎరుకల కిషన్ అతని కరెంట్ అకౌంట్ సిమ్ కార్డు గుర్తుతెలియని వ్యక్తి తీసుకొని పెద్ద మొత్తంలో లావాదేవీలు నిర్వహించినట్లు పోలిసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు దారుడితో పాటు కరీంనగర్‌కు చెందిన మరో వ్యక్తిచే కరెంట్ ఆకౌంట్ ఓపెన్ చేయించి గుర్తుతెలియని వ్యక్తులు లావాదేవీలు నిర్వహించినట్లు సమాచారం.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంభీరావుపేట సెప్టెంబరు 5: గంభీరావుపేట మండల కేంద్రానికి సమీపాన ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కందుకూల నవీన్ (27) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మల్లారెడ్డిపేటకు చెందిన నవీన్ 22 రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. హైదరాబాదులోని నిమ్స్ ఆసత్రితో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఉత్సాహంగా తీజ్ సంబరాలు

● తొమ్మిది రోజుల పాటు బంజారాల వేడుక


తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు


సిరిసిల్లలోని కళాశాల మైదానంలో సంబరాలు

సిరిసిల్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆచార వ్యవహారాలే ప్రాణంగా బంజారాల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ ఉత్సవాలను ఆటపాటలతో గిరిజనులు ఎంతో సంబురంగా జరుపుకున్నారు. గురువారం రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బంజారా సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు తొమ్మిది రోజుల పాటు వేడుకలు జరుపుకొని చివరిరోజు మానేరు తీరం వరకు తీజ్ నిమజ్జనం చేశారు. బతుకమ్మ తరహాలో జరిగే తీజ్ వేడుకలు తొమ్మిది రోజుల పాటు నాలుగు దశలుగా జరుపుకున్నారు. మొదటగా తీజ్ బోరా యేరో బుట్టల్లో గోధుమలను చల్లడం, రెండవది కడావో దేవతకు నైవేద్యం సమర్పించడం, మూడవది గన్‌కోర్ అంటే మేరామా, సేవాలాల్‌ల పెండ్లి, నాలుగోవది గోధుమ నారును చెరువులో వదలడం వేరా యేరోగా పిలిచే వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. బుట్టలతో గిరిజన యువతులు, మహిళలు ఆటలు, పాటలతో నృత్యాలు చేస్తూ వెళ్లారు. నానబెట్టిన బుట్టల్లో పెరిగిన గోదుమ నారు ను అన్నదమ్ములకు పంచారు. వైభవోపేతంగా జరుపుకున్న తీజ్ వేడుకల్లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, సీఐ కృష్ణ, వీర్నపల్లి మాజీ జడ్పీటీసీ గుగులోతు కళావతి, రైతు బంధు సమితి మాజీ చైర్మన్ గడ్డం నర్సయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకునూరి బాలరాజు ఉత్సవాల్లో పాల్గొని గిరిజను లకు శుభాకాంక్షలు తెలిపారు. ఖీమ్యానాయక్, కేకే మహేందర్‌రెడ్డిల బంజారాలు తమ ఉత్సవాలు జరుపుకోవడానికి స్థలం కేటాయింపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘం ప్రతినిధులు రామిరెడ్డి, దేవ్ సింగ్, గజన్‌లాల్, తిరుపతి, కేపతి, వినోద్, జేత్యా, భూపతి ఉన్నారు.


తీజ్ బుట్టలతో యువతులు

పోడు భూముల కేసులను ఎత్తివేయాలి

ప్రజాసంఘాల నాయకుల డిమాండ్



సిరిసిల్లలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 5: పోడు భూముల పోరాటాల్లో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన కేసులను రాష్ట్రప్రభుత్వం ఎత్తివేసి అర్హులైన వారందరికి పోడు పట్టాలను అందించాలని ప్రజా సంఘాల నాయకుడు మాల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు రైతుల పక్షాన నిలబడి పేదలకు పోడు భూముల హక్కు పత్రాలు ఇవ్వాలనే న్యాయమైన డిమాండ్‌తో పోరాడిన ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించి కోర్టుల చుట్టు తిప్పించడాన్ని ఖండిస్తున్నామన్నారు. పోడు రైతుల పక్షాన నిలబడిన ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. 50 సంవత్సరాల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ భూమిలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే సాగు చేసుకునే అవకాశం కల్పించి హక్కు పత్రాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జూలపల్లి మనోజ్‌కుమార్, ఇసంపెల్లి కొమురయ్య, జింక పోషయ్య, గుర్రపు నరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● హక్కు పత్రాలను అందించాలి

పోడు భూముల హక్కు పత్రాలు అందించడంతో పాటు పోరాటం చేసిన నాయకులు, రైతులపై పెట్టిన అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసి కోర్టుల నుంచి విముక్తి కల్పించాలని లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేష్‌నాయక్ డిమాండ్‌చేశారు. 2005 నుంచి 2022 వరకు గిరిజనులపై పెట్టిన పోడు భూ ముల కేసులను ఎత్తివేస్తామని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని ఆ హామీలను అమలు చేయడం లేదన్నారు. కేసులతో గిరిజన రైతులపై తీవ్రమైన మానసిక ఒత్తిడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోడు రైతులు రాజునాయక్, జగన్‌నాయక్, శ్రీనివాస్ నాయక్, ఇందల్ రాథోడ్, ప్రకాష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



కోరుట్ల పట్టణంలోని సాయి జీనియస్ పాఠశాలలో ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు



మెట్‌పల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



రాయికల్ మండలం భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో...

కోరుట్ల, సెప్టెంబరు 5 : పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయ వేషధారణలో తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. విద్యార్థులు సంస్కృతిక కార్యాక్రమాలను నిర్వహించి వేడుకలను జరిపారు. పాఠశాలలో విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించి అభినందించారు. పాఠశాల కరస్పాడెంట్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన శీలం రాజేష్, ప్రసాద్, శ్రీనివా స్‌రావు, దాసరి భీమయ్య, భట్టారి రాజేశం, గడిపల్లి అనూష, సతీష్, శ్రీకాంత్, రిటైర్డ్ టీచర్ రాపర్తి విజయలక్ష్మిలను లయన్స్ క్లబ్ పక్షాన శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షులు రాపర్తి నర్సయ్య, కార్యదర్శి స్తంభంకాడి రమేష్ పాల్గొన్నారు. పట్టణంలోని న్యూ హరిజనవాడ పాఠశాలలో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాటీ టీచర్‌ను విప్, ఎమ్మెల్యే సతీమణి కాంతాకుమారి సన్మానించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వపు విద్యార్థి, రిటైర్డ్ టీచర్ పెండ్యాల బాలకృష్ణను హెచ్‌ఎం పెండ్యాల మహేందర్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాయికల్ పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు దశా బ్దాల క్రితం పదవీ విరమణ పొందిన ఏనుగు వెంకటేశ్వర్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్, గట్టు రమేష్, నర్సయ్య, కౌన్సిలర్, కనాక వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కరస్పాండెంట్‌ను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ జూపల్లి తిరుపతిరావు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలె శేఖర్, కరస్పాండెంట్ జయశ్రీ, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్ పాల్గొన్నారు. మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎంసీ చైర్మన్ జక్కుల రాజేంద్రప్రసాద్, ప్రధానో పాధ్యాయులు యూవీ రమణి, ఉపాధ్యా యులు పాల్గొన్నారు. ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మోహన్ పాల్గొన్నారు. రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఒక్క రోజు ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్, పాఠశాల డైరెక్టర్‌లు మచ్చ లలిత, వి ద్యాన్వేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మల్యాల: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఆయా పాఠశాలల్లో సర్వేపల్లి రాదాకృష్ణన్ చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే మల్యాలలోని శ్రీవాగ్దేవి విద్యాసంస్థలు, ఎస్‌జీఆర్, లాస్య స్కూలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను వేడుకగా జరిపారు. ఆయా పాఠశాలలో కరస్పాండెంట్లు పోకల నరేష్‌కుమార్, బొడ్ల అనిల్, రాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల ఆల్ఫోర్స్ స్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో విద్యాసంస్థల అధినేత నరేంధర్‌రెడ్డి పాల్గొన్నారు. రాదాకృష్ణన్ చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



ధర్మపురిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం): పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవైట్ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులను సత్కరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను జరిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఉపాధ్యాయులను మెట్‌పల్లి లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. పట్టణం లోని జ్ఞానోదయ డిగ్రీ కాలేజ్ అధ్యపక బృందాన్ని యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఆశిష్ డోక్ సన్మానించారు. అండర్ 19 కబడ్డీలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను కాలేజ్ కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, మేనేజర్ ఆశిష్ డోక్ సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఇల్లెందుల శ్రీనివాస్, సెక్రటరీ రాకేష్, వేణుగోపాల్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను జరిపారు. విద్యార్థులతో పాటు పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. యువజన సంఘల నాయకులు పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా అధ్యాపకులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. డా.. సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చెలిమల జయ పాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మండలంలోని చెప్యాల పాఠశాలలో విదులు నిర్వహిస్తున్న హిందీ పండితుడు బొమ్మ సురేష్ ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారాన్ని ప్రభుత్వ విప్ లక్ష్మన్ కుమార్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ రాంబాబు, డీఈవో జగన్‌మొహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని వెల్లుల్లలోని గౌతమ్ విద్యానికేతన్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి కరస్పాండెంట్ తొగిటి అంజ య్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ తొగిటి లక్ష్మి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు మొగిలిపేట, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయ వేషాధారణలో పాఠాలు నేర్పారు. మొగిలిపేటలోని శ్రీ చైతన్య పాఠశాలలో గురు పూజోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో లోటుపాట్లు సవరించాలి

డీఈవోకు యూటీఎఫ్ నేతల వినతి

జగిత్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలు, వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లలో చోటుచేసుకున్న లోటుపాట్లను సవరించాలని కోరుతూ డీఈవో జగన్ మోహన్‌రెడ్డికి టీఎస్ యూ టీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తిరుక్కోవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్ వినతిపత్రం అందజేశారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో డీఈవోను కలిసి సమస్యను విన్న వించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. గత బదిలీల్లో స్పౌస్‌లో జరిగిన లోటు పాట్లను సైతం సవరించి అక్రమాలకు పాల్పడిన వారిపై విచారణ చేయాలని కోరుతూ వినతిప్ర తం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 5: ఉద్యోగులు, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని టీ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మెన్ బోగ శశిధర్, సెక్రటరీ జనరల్ గంగుల సంతోష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల వర్షం నష్టాల దృష్ట్యా ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీ ప్రభుత్వానికి సహరించే రీతిలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఉద్యోగుల ఒక రోజు వేతనం 130కోట్లు విరాళాన్ని స్వయంగా సీఎం సమక్షంలో ప్రకటించారన్నారు. ఈ విషయాన్ని అనేక సంఘాలు, సమాజం హర్షిస్తున్న తరుణంలో లచ్చిరెడ్డి జేఏసీ నాయకుడిగా, బాధ్యుడిగా పేర్కొంటూ వంద కోట్ల విరాళం తాను ఇప్పించనున్నట్లు ప్రకటన చేయడాన్ని జిల్లా జేఏసీ చైర్మన్లు, సెక్రటరీ జనరల్ ఖండించారు.

ఆసుపత్రిని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

మల్యాల, సెప్టెంబరు 5: మల్యాల ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సందర్శించారు. ఆసుపత్రిలో మందుల కొరత నెలకొనడంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆసుపత్రిలో ఫార్మసీ పరిశీలించి స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో లేని మందులను రేపటిలోగా తెప్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులు తనిఖీ చేశారు.

ఆసుపత్రిలో మందుల కొరత, వైద్య సిబ్బంది తీరుపై ముత్యంపేట మాజీ సర్పంచ్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ డీఎంహెచ్‌వో డా.సమీయొద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాల నేపథ్యంలో మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

పూర్తిస్థాయిలో పెద్దాపూర్ గురుకులం సమస్యల పరిష్కారం

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 5 : మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో అన్ని రకాల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడమే ప్రధాన లక్ష్యమని ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం గురుకుల పాఠశాలను పరిశీలించామన్నారు. పాఠశాల బుధవారం తిరిగి పునః ప్రారంభించినందున విద్యార్థులు తరలివస్తున్నరన్నారు. గురుకులంలో ఇతర సమస్యలు, చేపట్టిన పనుల వివరాలు, కావాల్సిన వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలసుకున్నారు. గురుకులం కావాల్సిన వసతులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. పాఠశాలలోని తొమ్మిది, ఎనిమిద తరగతులను శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవిలత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డీటీ రాజుమహ్మద్, ఆర్ఐ ఉమేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటు



సంతోష్

గొల్లపల్లి, సెప్టెంబరు 5: గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని మల్లన్నపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, భీమ సంతోష్, వైస్ చైర్మన్‌గా శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన పుర పాటి రాజరెడ్డి నియమితులయ్యారు. డైరెక్టర్‌లుగా కొక్కుల జలంధర్, ఓరుగంటి తిరుపతి, పూటూరి అనూష, జక్కుల దస్తగిరి, గుంటుకుల నర్సయ్య, పూట్కూరి సురేందర్‌రెడ్డి, నక్క రాజయ్య, అత్తెన శివయ్య, జేరి పోతుల కొమురయ్య, ఎస్‌కే గంగమియా, కట్ట లక్ష్మణ్‌రావు, చంద సత్తయ్య నియమితులయ్యారు. నూతన కమిటీకి రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

పోషణ లోపాలు రాకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలి

సీడీపీవో మణెమ్మ



గర్భిణులకు జాగ్రత్తలను వివరిస్తున్న సీడీపీవో మణెమ్మ

కోరుట్ల, సెప్టెంబరు 5 : కిశోర బాలలు, గర్భిణులలో పోషణ లోపాలు రాకుండ ప్రత్యేక శ్రద్ధ చూపాలని మెట్‌పల్లి ఐసీడీఎస్ సీడీపీవో మణెమ్మ అన్నారు. గురువారం పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పోషణ మాస కార్యక్రమాల నిర్వహణనను పరిశీలించారు. బరువు తక్కువ ఉన్న పిల్లలు, గర్భిణులను గుర్తించి వారి ఆరోగ్య పోషణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడి టీచర్లు, ఆశా వర్కర్స్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అవసరం

మెట్‌పల్లి రూరల్: ఎదుగుతున్న పిల్లలకు పోషకాలతో కూడిన పౌషికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీనాసు ల్తానా అన్నారు. పోషణ్ మాసోత్సవాల సందర్భంగా గురువారం మండలంలోని మేడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణి, బాలింతలకు, చిన్నారుల తల్లిదండ్రులకు పౌషికాహారం, విద్యపై ప్రాధాన్యతను వివరించారు. ఆహారంలో విటమిన్లు, ప్రొటీన్లు, కొవ్వులు, పిండి పదార్థులు అన్ని ఉన్నాయా లేదా అని చూసుకోని పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మావతి, భాగ్యలక్ష్మి, ఆయాలు రజిత, రాధ, మహిళలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు తప్పవు

కమిషనర్ బట్టు తిరుపతి

కోరుట్ల, సెప్టెంబరు 5 : ప్లాస్టిక్ విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కమీషనర్ బట్టు తిరుపతి వ్యాపారస్తులను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ప్లాస్టిక్ ఏజన్సీల తో పాటు దుకాణాలలో మున్సిపల్ సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బాలే అశోక్, జూనియర్ అసిస్టెంట్ ఆకు అంజయ్యలు వారి సిబ్బందితో దాడులు నిర్వహించారు. దుకాణాలలో ప్లాస్టిక్ నిలువలను గుర్తించి స్వాధీనం చేసుకోని రూ. 5,500 జరమానలు విధించారు. ఈ సందర్భంగా దుకాణాలకు వచ్చే కొనుగోలు దారులు బట్ట సంచులతో వస్తేనే సామాగ్రిని విక్రయించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ప్రసాద్, రమేష్, రాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

జగిత్యాల ఆర్డీవో మధుసూధన్

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 5 : లింగనిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాల పై కఠినచర్యలు తీసుకుంటామని జగిత్యాల ఆర్‌డీఓ మధుసూదన్ అన్నారు. కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని పలు స్కానింగ్ కేంద్రాలను ఆర్డీవో మధుసూదన్ తనిఖీ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ లింగని ర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి పరీక్షలు చేస్తే స్కానింగ్‌కేంద్రాల అనుమతులను రద్దు చేస్తామన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా మాతశిసుసంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను కలెక్టర్ ఆదేశాల మేరకు డాక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రుల్లో రోగుల వైద్యసేవల ఖర్చుల వివరాలను పట్టికలో ప్రదర్శించిన ప్రకారమే రోగి నుంచి ఫీజులు తీసుకోవాలన్నారు. ఎవరైనా రోగుల నుంచి అధిక ఫీజులు వసూల్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. టెస్టుల పేరుతో రోగులను ఆర్థికంగా ఇబ్బంది పెట్టొదన్నారు. ఒకరి పేరుమీద అనుమతులు పొంది మరొక డాక్టర్ చేత వైద్యం చేస్తే సదరు ఆస్పత్రిని రద్దు చేసి డాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగుల పట్ల అమర్యాదగా వ్యవహరించవద్దన్నారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

జగిత్యాల డీఎస్పీ రఘుచందర్



సమావేశంలో మాట్లాడుతున్న జగిత్యాల డీఎస్పీ

ధర్మపురి, సెప్టెంబరు 5: వినాయక నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, ప్రతి ఒక్కరు సహకరించాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ కోరారు. ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం గణేష్ మండప నిర్వాహకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ రఘుచందర్ మాట్లాడుతూ నవరాత్రుల్లో ఒక కమ్యూనిటీ, ఒక మతం గురించి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగాలని కోరారు. సీరియల్ నెంబర్ ప్రకారం ఉదయం నుంచే విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. డీజే అనుమతి లేదని, ఒక వేళ వాడితే పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. మద్యం సేవించి అల్లర్లకు పాల్పడొద్దన్నారు. సీఐ రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ మండపాల వద్ద ట్రాన్స్‌కో నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఎస్ఐ గంగుల మహేష్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బాలె గంగాధర్, వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, ట్రాన్స్‌కో ఏఈఈ రవి పాల్గొన్నారు.

సారంగాపూర్: వినాయక నవరాత్రి ఉత్సవాల సంధర్బంగా శుక్రవారం మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్‌లో ఆయా గ్రామాలకు చెందిన మండపాల నిర్వాహకులతో రూరల్ సీఐ సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్సై దత్తాద్రి ఇక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఉంటుందని నిర్వాహకులు తప్పని సరిగా హజరై పోలీస్ వారి సూచనలు స్వీకరించాలని కోరారు.

మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం): ప్రశాంత వాతవరణంలో వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో వినాయక మండపాల నిర్వహకులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద కమిటీ నిర్వహకులు, బాధ్యత వహించే వారి వివరాలు ఫోన్ నెంబర్లు మండపంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ చిరంజీవి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: వినాయక మండప నిర్వహకులు ప్రతి ఒక్కరు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వినాయక మండప నిర్వహకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మండపాల వద్ద కమిటీ నిర్వహకులు, బాధ్యత వహించే వారి వివరాలు ఫోన్ నెంబర్లు మండపంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ పాల్గొన్నారు.

వెల్గటూర్: రాబోయే గణేష్ నవ రాత్రులు ప్రశాంతంగా నిర్వహించాలని సీఐ రామ్ నర్సింహారెడ్డి కోరారు. బుధవారం వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో మండలంలోని గణేష్ మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నవరాత్రుల్లో నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎస్సై ఉమాసాగర్, పోలీసులు పాల్గొన్నారు.

సంక్షిప్తం సమాచారం

సారంగాపూర్: పీఆర్‌టీయు టీఎస్ మండలశాఖ అధ్యక్షుడిగా మానేరు శంకరయ్య జడ్పీహెచ్ఎస్ కోనాపూర్. ప్రధాన కార్యదర్శిగా సంగ శ్రీధర్ ఎంపీపీఎస్ వడ్డెర కాలనీ, అసోసియేట్ అధ్యక్షులుగా రాజనర్సయ్య జడ్పీహెచ్ఎస్ అర్పపల్లి. కార్యదర్శి ఉమేష్ ఎంపీపీఎస్ గొల్లవాడ లక్ష్మీదేవిపల్లి. మహిళ కార్యదర్శిగా గోలినిర్మల జడ్పీహెచ్ఎస్ రంగపేట వీరు ఎన్నికయ్యారు.

●సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేసి బదిలీపై వెళ్లగా గురువారం కళాశాల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు శాలువతో ఘనంగా సన్మానించారు.

●జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టరు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెంబట్ల గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు.

రాయికల్: రాయికల్ మండల పీఆర్‌టీయూ టీఎస్ నూతన అధ్యక్షుడిగా అంతడుపుల గంగరాజం ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రాపర్తి నర్సయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా దొంతి సతీష్, ఉపాధ్యక్షులుగా కడకుంట్ల అభయ్ రాజ్, ఎస్.శోభ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా చెట్‌పెల్లి బాపురావు, తరంగిణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కొడిమ్యాల : తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని మండలంలోని పూడూర్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో గురువారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు.

గొల్లపల్లి: గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలను వేయించి పశు సంపదను కాపాడుకోవాలని మండల పశు వైద్యాధికారి రవీందర్ గొర్రెలు, మేకల పెంపకందారులకు సూచించారు.

మెట్‌పల్లి రూరల్: రైతులు మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని మండల వైద్యాధికారి డాక్టర్ మనీషాపటేల్ సూచించారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని మేడిపల్లి, ఆరోఎట గ్రామాలలోని మేకలు, గొర్రెలకు ఉచితంగా వ్యాధి నివారణ టీకాలను వేసి అవగాహన కల్పించారు.

●మండలంలోని చింతలపేట గ్రామ శివారులోని రహదారి పైన నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు వద్ద పాలలాగా కనిపిస్తున్న నీటికి గ్రామస్థులు పూజలు చేశారు. గురువారం కల్వర్టు కింది భాగంలోని చిన్న గుంతల నుంచి పాలలాగా నీరు పైకి రావడంతో వింతగా భావించి గ్రామస్థులు పూజలు చేశారు.

కోరుట్ల రూరల్ : అసంక్రామిక వ్యాధుల నివారణ పై ప్రజలకు అవగాహన కల్పించి వాటి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్చన ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గురువారం మండలం ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో కోరుట్ల, కథలాపూర్, అయిలాపూర్, అంబారిపేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది, స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలకు అసంక్రామిక వ్యాధుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తను వ్యాధి గ్రస్తులకు వివరించి నివారణపై అవగాహన కల్పించాలి.

కొడిమ్యాల: నాచుపల్లి జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కళాశాలలో వినాయక చవితి ఏర్పాట్ల కోసం గురు వారం కొందరు ఇంజనీరింగ్ విద్యార్థులు ఒక హెచ్‌వోడీని చందా అడుగగా చెత్త పనులకు తాను చందా ఇవ్వనని అన్నాడని ఇంజనీరింగ్ విద్యార్థులు ఆరోపిస్తు కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్‌ను వివరణ కోరగా విద్యార్థుల పట్ల ప్రొఫెసర్లు సంయమనం పాటించాలని హెచ్‌వోడీలకు తెలిపామన్నారు.

●నాచుపల్లి జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ డా.. కె. వసంత్‌కుమార్‌ను నియమిస్తూ జేఎన్‌టీయుహెచ్ రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.. బి. ప్రభాకర్ తెలిపారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం) : పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో గురువారం ఎల్ఐసీ 68వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసీ మేనేజర్ కె.వి. రమ శర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎల్ఐసీ పాలసీ చేసుకోవాలని కోరారు.

మల్లాపూర్ : దేశ నిర్మాణం, చరిత్ర సంస్కృతిలో విశ్వకర్మల పాత్ర చాలా ప్రధానమైందని, కుల వృత్తులను కాపాడుకోవాల్సిన అవష్యాకత ఎంతో ఉందని విశ్వకర్మ నాలెడ్జ్ కేంద్ర జిల్లా ప్రధాన కార్యదర్శి రాజోజి సాయిరాం పేర్కొన్నారు. గురువారం మండలంలోని రేగుంట గ్రామానికి చెందిన ఆయన జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైనందుకు సన్మానించారు.

కథలాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారంతోనే పిల్లలు బలవర్ధకంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షైమదీబేగం సూచించారు. గురువారం మండలంలోని తాండ్ర్యాలలో పోషణ్ మాసోత్సవాల సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కేంద్రాల ప్రాధాన్యను వివరించారు.

●ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలతో పాటు ఊట్‌పల్లి పాఠశాల ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం ఉన్నతపాఠశా లతోపాటుగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధక్రిష్ణన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాధక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి వేడుకలు నిర్వహించారు.

●మహిళసంఘాల సభ్యులకు ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మహిళశక్తి యూనిట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని జిల్లా సెర్ప్ ఏపీడి చరణ్‌దాసు అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామానికి చెందిన పలువురు మహిళసంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన క్యాంటీన్, రెడీమెడ్ బట్టల యూనిట్, నాటుకోళ్ల పెంపకం యూనిట్లను ఏపీడీ పరిశీలించారు.

రాయికల్: రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది గురువారం కళాశాలకు గైర్హాజరు అయిన విద్యార్థులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి విద్యార్థులకు కళాశాలకు క్రమం తప్పకుండా పంపించాల తల్లిదండ్రులకు సూచించారు. ప్రిన్సిపాల్ జె.రాజేష్, అధ్యాపకులు

జగిత్యాల అర్బన్: క్రిప్టో కరెన్సీ మల్టీలెవల్ మార్కెటింగ్‌లో నిమగ్నమై విధులను నిర్లక్ష్యం చేస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

మల్యాల: రేపటి నుంచి ప్రారంభమయ్యే గణేశ్ నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా శాంతియుతంగా నిర్వహించుకోవాలని సీఐ నీలం రవి అన్నారు. మండలంలోని గణేశ్ మండపాల నిర్వాహకులతో గురువారం సమావేశం అయ్యారు.

వెల్గటూర్: వెల్గటూర్ మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూల వేసి నివాళి అర్పించారు.

పెగడపల్లి : మండలంలోని నంచర్లలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాదుల దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలలో బాగంగా నంచర్లలో వైద్య శిబిరం నిర్వహించి, పరీక్షలు నిర్వహించారు.